సూపర్ జేమ్స్ విద్యార్థులకు కలెక్టర్ అభినందన

కలెక్టర్‌కు విరాళం అందజేస్తున్న పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు (ఫైల్), విద్యార్థులను అభినందిస్తూ కలెక్టర్ పంపిన లెటర్

కొణిజర్ల, డిసెంబర్ 26: సెప్టెంబర్ నెలలో ఖమ్మంలో సంభవించిన వరదల్లో సర్వం కోల్పోయిన బాధితుల కోసం కొణిజర్ల సమత సూపర్‌జేమ్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పిలుపు మేర కు 'నా ఖమ్మం కోసం నేను' అనే నినాదంతో రూ.35 వేల విరాళాలను సేకరించి కలెక్టర్‌కు అందజేశారు. స్పందించిన కలెక్టర్ సూపర్‌జేమ్స్ పాఠశాల ప్రిన్సిపాల్, స్టాఫ్, విద్యార్థులను అభినందిస్తూ గురువారం ప్రత్యేకంగా లెటర్ ద్వారా కృతజ్ఞతలు తెలిపారు.

ఖమ్మం మార్కెట్‌లోకి బజాజ్ ఎలక్ట్రికల్ ఆటోలు

నూతన ఎలక్ట్రికల్ ఆటో కీ ని కస్టమర్లకు అందజేస్తున్న ఎండీ రాజేంద్రప్రసాద్

రఘునాథపాలెం, డిసెంబర్ 26: ప్రముఖ ఆటో రంగ దిగ్గజ సంస్థ బజాజ్ రెండు సరికొత్త ఎలక్ట్రికల్ ఆటోలను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. ప్యాసింజర్, కమర్షియల్ రంగాల్లో వీటిని వినియోగదారుల ముందుకు తీసుకొచ్చింది. ఈ నూతన ఎలక్ట్రికల్ ఆటోల ఆవిష్కరణ కార్యక్రమం ఖమ్మంలోని అధీకృత డీలర్ వెంకటరమణ ఆటో మొబైల్ షోరూంలో గురువారం జరిగింది. వీవీసీ, వీవీఆర్ గ్రూపుల మేనేజింగ్ డైరెక్టర్ వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఆటో రంగంలో సీఎన్‌జీ, పెట్రోల్, డీజిల్, ఎలక్ట్రికల్ వంటి అన్ని రకాలను ఒకే చోట అందించాలనే ఉద్దేశంతో క్విక్ సర్వీస్‌ను తీసుకొచ్చినట్లు వివరించారు. బజాజ్ డివిజన్ ఆర్ఎం బాబ్జీ మాట్లాడుతూ.. 70 ఏళ్ల సర్వీస్ కలిగిన బజాజ్ సంస్థ.. వినియోగదారుల సౌలభ్యం కోసం ఈ డబుల్ డెక్కర్ షోరూంను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. వీవీసీ గ్రూపు సంస్థల చైర్‌పర్సన్ వంకాయలపాటి ద్రౌపది, వీవీసీ ఆటో మొబైల్స్ డైరెక్టర్ వీరేన్ చౌదరి, సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

పెనుబల్లిలో మంత్రి పొంగులేటి పర్యటన

కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి పొంగులేటి

పెనుబల్లి, డిసెంబర్ 26: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం సాయంత్రం పెనుబల్లిలో పర్యటించారు. తొలుత పెనుబల్లి మసీదు నుంచి వైద్యశాలకు వెళ్లే సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పెనుబల్లి, కల్లూరు మండలాల కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 31 లోపు ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయడం జరుగుతుందని, నిరుపేదలైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయి, ఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ, వైస్‌చైర్మన్ రాజబోయిన కోటేశ్వరరావు, నాయకులు మట్టా దయానంద్ పాల్గొన్నారు.

డైట్ సీవోఈ నిర్మాణ పనులకు నేడు శంకుస్థాపన

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 26: డైట్ కళాశాలను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ)గా ప్రకటించిన నేపథ్యంలో దాని నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం శంకుస్థాపన చేయనున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ గురువారం తెలిపారు. రాష్ట్రంలోని రెండు డైట్ కళాశాలలను కేంద్ర ప్రభుత్వం సీవోఈలుగా ఎంపిక చేయగా.. అందులో ఖమ్మం డైట్ కళాశాల ఒకటి. రూ.8.62 కోట్లతో సీవోఈ భవనం నిర్మించనున్నారు. మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. మరో రూ.2 కోట్ల నిధులతో ఇప్పటికే ప్రస్తుతం ఉన్న భవనానికి మరమ్మతులు, కరెంట్ సరఫరా వంటి పనులు నిర్వహిస్తున్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న మాస్‌లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఝాన్సీ

కారేపల్లి, డిసెంబర్ 26: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ ఎంఎల్ (మాస్‌లైన్) ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఝాన్సీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కారేపల్లిలో విలేకరులతో ఆమె మాట్లాడారు. విద్యాశాఖలో అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులతో ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి వారి డిమాండ్లను పరిష్కరించాలన్నారు. సమావేశంలో గుమ్మడి సందీప్, ఎన్వీ రాకేశ్, గుగులోత్ తేజా నాయక్, పులకాని సత్తిరెడ్డి, కోటేశ్, వీరన్న, రఘుపతి, ధరావత్ సక్రు, చల్లా రాజు, కోయల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీపీఐ పైలాన్‌ను ఆవిష్కరించిన సురేశ్

ఖమ్మం రూరల్, డిసెంబర్ 26: సీపీఐ శత వసంతాలను పురస్కరించుకొని వరంగల్ క్రాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన 26 అడుగుల పైలాన్‌ను జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేశ్ గురువారం ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్‌చేసి కార్యకర్తలకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల కళ్లు కప్పి.. అక్రమంగా ఇసుక రవాణా

బోనకల్లులో టాస్క్‌ఫోర్సు దాడిలో పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు, మధిరలో స్వయం సహాయక సంఘాలకు రీచ్‌లను అప్పగిస్తున్న అధికారులు

- పట్టుకొని తనిఖీ చేస్తే తప్ప వెలుగులోకి రాకుండా తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి, ఎస్‌హెచ్‌జీ గ్రూపుల రాబడికి గండి

మధిర, డిసెంబర్ 26: ఇసుక అక్రమార్కులందరూ అధికారుల కళ్లు గప్పి అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. పట్టుకొని తనిఖీ చేస్తే తప్ప వెలుగులోకి రాకుండా జాగ్రత్త పడుతూ ఇసుకను తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి, స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) రాబడికి భారీగా గండి పడుతోంది.

మధిర నియోజకవర్గంలోని మధిర, బోనకల్లు, చింతకాని, ముదిగొండ, ఎర్రుపాలెం మండలాల పరీవాహకంలోని మున్నేరు నుంచి రాత్రి సమయంలో అక్రమార్కులు ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో ఇసుక రవాణాను నిలిపివేయాలని మైనింగ్, పోలీసు, రెవెన్యూ అధికారులకు ఇటీవల జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈ ప్రాంతాల నుంచి ఇసుక రవాణా నిలిచిపోవడంతో అక్రమంగా ఇసుక రవాణాదారులకు కళ్లెం వేసినట్లయింది. ప్రభుత్వ అనుమతులు లేకపోవడంతో ఇసుక రవాణా నిలిచిపోయింది. కానీ నియోజకవర్గంలో ఇసుక రీచ్‌లు ఉన్న ప్రాంతంలో ఆ గ్రామాల్లోని ఎస్‌హెచ్‌జీల అభ్యున్నతి కోసం ఆ సంఘాల్లోని మహిళా సభ్యులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఇసుక రవాణా చేసేందుకు అనుమతిచ్చారు. అయినప్పటికీ ఈ రవాణాను రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. దీంతో స్వయంగా అధికారులే స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఈ ఇసుక రీచ్ కూపన్లు అప్పగించారు. ప్రభుత్వ ఆదాయంతోపాటు ప్రతి కూపన్‌పై ఒక్కో ట్రాక్టర్ రూ.500 రుసుమును స్వయం సహాయక సంఘాలకు చెల్లించి ఇసుకను తీసుకెళ్లేందుకు అనుమతులిచ్చారు. అయినప్పటికీ ఇసుక అక్రమ రవాణాదారులు మాత్రం కూపన్లు తీసుకోకుండా ప్రభుత్వ ఆదాయానికి, స్వయం సహాయక సంఘాల రాబడికి గండి కొడుతున్నారు. వందలాది ట్రిప్పుల ఇసుకను రోజూ అక్రమంగా తరలించుకొని వెళ్తున్నారు. వాస్తవంగా ఈ ఇసుక తరలించే ట్రాక్టర్లకు కూపన్లు ఉన్నాయన్న ఆలోచనతో అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో అక్రమార్కులు రాత్రి పగలు అనే తేడా లేకుండా ఇసుకను యథేచ్ఛగా తరలించుకొని వెళ్తున్నారు.

వారం రోజులుగా నిఘా..

ఈ ఇసుక అక్రమ రవాణాపై ఖమ్మం టాస్క్‌ఫోర్స్ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. వారం రోజులుగా ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని అనుమతులను పరిశీలిస్తున్నారు. ఈ పరిశీలనలో అసలైన నిజాలు బయటపడడంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆ ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలిస్తున్నారు. ఈ అక్రమ ఇసుక రవాణా చేసేది అధికార పార్టీ నాయకుల ట్రాక్టర్లు కావడంతో స్థానిక అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే అదునుగా భావించి మరికొందరు అక్రమార్కులు కూడా ఇసుక అధికార పార్టీ నేతలతో కలిసి యథేచ్ఛగా ఇసుక రవాణా చేస్తున్నారు. అయితే, స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని, ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారని స్థానిక ప్రజలు ఇటీవల జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు రంగంలోకి దిగారు. బోనకల్లు మండలంలో నాలుగు ట్రాక్టర్లు, చింతకాని మండలంలో రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని సీజ్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

కోర్టు ఉత్తర్వులతో నిలిచిపోయిన మట్టితరలింపు

పనులు నిలిపివేస్తున్న పోలీసులు

ముదిగొండ, డిసెంబర్ 26: మండలంలోని కమలాపురం రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమి నుంచి మట్టి తరలించేందుకు అనుమతులు తీసుకుని పట్టా భూమిలో మట్టి తరలిస్తున్నారని పట్టాదారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా మట్టి తవ్వకాలు ఆగకపోవటంతో పట్టాదారు ఖమ్మం కోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేశారు. పట్టాదారుడికి ఉన్న భూమిని నిర్ధారించేంత వరకూ మట్టి తవ్వకాలు నిలిపివేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. కోర్టు ఉత్తర్వుల ప్రతిని అధికారులకు అందించడంతో పోలీసులు వచ్చి మట్టి తరలింపును నిలిపి వేశారు.

భక్త సమ్మేళనానికి విరాళం

సత్తుపల్లి, డిసెంబర్ 26: ఈ నెల 28, 29 తేదీల్లో సత్తుపల్లిలో జరగనున్న రామకృష్ణ భావ ప్రచార పరిషత్ తెలంగాణ భక్త సమ్మేళనానికి సత్తుపల్లికి చెందిన శారద రెసిడెన్సీ, రామకృష్ణ యోగాసమితి ఆధ్వర్యంలో చళ్లగుళ్ల అప్పారావు గురువారం రూ.25 వేలు ఎమ్మెల్యే మట్టా రాగమయి చేతుల మీదుగా నిర్వాహకులకు అందించారు. రామకృష్ణ సేవాసమితి సత్తుపల్లి అధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు, ప్రైవేట్ స్కూల్స్ బాధ్యులు నాయుడు వెంకటేశ్వరరావు, పులి శ్రీనివాసరావు, నాయకులు మట్టా దయానంద్, గాదె చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి కోసం మూడు గంటల నిరీక్షణ

ఎదురుచూసీచూసీ విసిగిపోయిన ఉన్నతాధికారులు, వైద్యులు

తీరా ప్రధాన రహదారిపై నుంచి అభివాదం చేస్తూ వెళ్లిపోయిన మంత్రి

మంత్రి పొంగులేటి రాక కోసం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఎదురుచూస్తున్న అధికారులు, వైద్యులు

సత్తుపల్లి టౌన్, డిసెంబర్ 26 : ఖమ్మం జిల్లా సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా అధికారులు, వైద్యులు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాక కోసం గురువారం మూడు గంటల పాటు నిరీక్షించారు. తీరా ఆసుపత్రి ఎదుట ప్రధాన రహదారి మీదుగా అభివాదం చేస్తూ.. త్వరలోనే వస్తానని చెబుతూ వెళ్లిపోవడంతో అధికారులు, పార్టీ కార్యకర్తలు నిరాశతో వెనుదిరిగారు. సత్తుపల్లిలో గురువారం మధ్యాహ్నం మంత్రి పొంగులేటి పలు ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొంటారని షెడ్యూల్ విడుదల చేశారు. షెడ్యూల్‌లో లేనప్పటికీ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో సత్తుపల్లిలో నూతనంగా నిర్మించిన వంద పడకల ఆసుపత్రిని పరిశీలించేందుకు రానున్నారని అధికారులు, నాయకులకు సమాచారం అందించారు. దీంతో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, టీసీఎస్‌హెచ్ రాజశేఖర్‌గౌడ్, ఆర్డీవో రాజేంద్ర గౌడ్‌తోపాటు సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కే.వెంకటేశ్వర్లు, వైద్యులు, సిబ్బంది, నాయకులు పెద్ద ఎత్తున ఆసుపత్రి ప్రాంగణంలోకి చేరుకున్నారు. సాయంత్రం 7 గంటల వరకు ఎదురు చూసినప్పటికీ పొంగులేటి ఆసుపత్రి మీదుగా వెళ్తూ ప్రధాన రహదారిపై నాయకులకు కారులో నుంచే అభివాదం చేశారు. తదుపరి కార్యక్రమాలకు ఆలస్యమవుతున్నందున ఆసుపత్రి పరిశీలనకు త్వరలోనే వస్తానని చెప్పడంతో అధికారులు, నాయకులు వెనుదిరిగారు.

క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరూ ఆచరించాలి

మహిళలకు చీరలు అందజేస్తున్న ఎమ్మెల్యే

కారేపల్లి, డిసెంబర్ 26: ఏసుక్రీస్తు బోధనలను ప్రతిఒక్కరూ ఆచరించాలని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రేమవిందులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అన్ని పండుగలను కులమతాలకతీతంగా జరుపుకోవాలన్నారు. అనంతరం మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐ బీ.తిరుపతిరెడ్డి, ఎస్సై రాజారాం, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మి, నాయకులు పగడాల మంజుల, నర్సింగ్ శ్రీనివాసరావు, ఇమ్మడి తిరుపతిరావు, మేదరి టోనీ, తలారి చంద్రప్రకాశ్ పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు కార్మికుల వినతి

ములకలపల్లి, డిసెంబర్ 26: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర మంత్రి సీతక్కకు మండలంలోని పంచాయతీ కార్మికులు గురువారం వినతిపత్రం సమర్పించారు. మండలంలో గురువారం సీతక్క పర్యటించారు. తమకు జీతాలు పెంచాలని, బకాయిలను విడుదల చేయాలని, పని భారం తగ్గించాలని కోరారు.

పెద్దమ్మ గుడిలో పూజలు

పాల్వంచ రూరల్, డిసెంబర్ 26: మండలంలోని పెద్దమ్మ గుడిని మంత్రి సీతక్క గురువారం దర్శించుకుని పూజలు చేశారు. ఆమె వెంట ఈవో రజనీకుమారి ఉన్నారు.

సీతక్కకు సన్మానం

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 26: జిల్లా పర్యటన ముగించుకుని హైదరాబాద్ వెళ్తున్న మంత్రి సీతక్కను ఎమ్మెల్యే కోరం కనకయ్య గురువారం మండలంలోని బొజ్జాయిగూడెంలోని సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువా కప్పి సత్కరించారు.

నిత్యావసరాలు, సోలార్‌లైట్లు పంపిణీ

దుమ్ముగూడెం, డిసెంబర్ 26: దుమ్ముగూడెం పోలీసుశాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని నారాయణరావుపేట పంచాయతీ సిరిగుండం గొత్తికోయ గ్రామంలో ఆదివాసీ కుటుంబాలకు గురువారం నిత్యావసర సరుకులు, సోలార్‌లైట్లను సీఐ అశోక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఆదివాసీల కోసం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని, వలస ఆదివాసీల అభివృద్ధి కోసం ఇతర శాఖ అధికారులతో సమన్వయంతో పోలీసుశాఖ కృషి చేస్తుందన్నారు. గ్రామప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని జిల్లా యంత్రాంగం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ఎలాంటి సమస్యలున్నా పోలీసు అధికారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు వెంకటప్పయ్య, గణేష్, స్పెషల్ పార్టీ, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధితో అప్రమత్తంగా ఉండాలి

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 26: క్షయ వ్యాధితో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ లోహిత అన్నారు. మండలంలోని కొమరారం పంచాయతీ ఒడ్డుగూడెం, నాయకులగూడెంలో గురువారం క్షయ వ్యాధి నివారణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్షయ వ్యాధిగ్రస్తులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, ఉమ్మినప్పుడు సూక్ష్మ క్రిములు నేరుగాగానీ, గాలి ద్వారాగానీలో ఇతరులకు సోకుతాయని, వ్యాధిని వ్యాపింపజేస్తాయని వివరించారు. అలసట, తలనొప్పి, బరువు తగ్గడం, జ్వరం, రాత్రి పూట చెమటలు పట్టడం, ఆకలి మందగించడం వంటివి ఈ వ్యాధి లక్షణాలని చెప్పారు. ఇలాంటివి కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని కోరారు.

ఆసుపత్రి భవనాల నిర్మాణం పరిశీలన

అశ్వారావుపేట, డిసెంబర్ 26: స్థానిక ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మాణంలోగల భవనాలను డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు గురువారం పరిశీలించారు. ముందుగా, ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ను పరిశీలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధారుక్మిణి, ఆర్ఎంవో డాక్టర్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల టోకెన్ సమ్మె

భద్రాచలం, డిసెంబర్ 26: గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. నేడు, రేపు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిర్వహించనున్న టోకెన్ సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ పిలుపునిచ్చారు. గురువారం ఉదయం పంచాయతీ కార్యాలయం ఆవరణలో కార్మికులతో సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎంబి.నర్సారెడ్డి అధ్యక్షతన విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలనలో అరెస్టులు ఉండవని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి అధికారం చేపట్టాక అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దలు పంచాయతీ కార్మికులతో చర్చించి ఉద్యోగ భద్రతతో పాటు జీతాల పెంపుపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. గడ్డం స్వామి, బండారు శరత్‌బాబు, నకిరికంటి నాగరాజు, పారెల్లి సంతోష్‌కుమార్, కాపుల రవి, చెన్నకేశవులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

వేంసూరు: చెక్కు అందజేస్తున్న సండ్ర, పెనుబల్లి: లంకాసాగర్‌లో..

వేంసూరు/పెనుబల్లి, డిసెంబర్ 26: రాజ్యసభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సహకారంతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును వేంసూరు మండలంలోని వైఎస్ బంజర గ్రామానికి చెందిన చిలకా భూదేవి, పెనుబల్లి మండలం లంకాసాగర్ గ్రామానికి చెందిన నరెడ్ల రఘుపతిరెడ్డికి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గురువారం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ కూసంపూడి మహేశ్, మాజీ ఎంపీపీ పాగట్ల వెంకటేశ్వరరావు, కృష్ణయ్య, కెంపు రాజు, వీసంపల్లి మోహన్‌రావు, వీసంపల్లి వెంకటేశ్వరరావు, దొడ్డ చక్రధర్ రెడ్డి, మందడపు అశోక్‌కుమార్, తుమ్మలపల్లి రమేష్, పరగడపు రాములు తదితరులు పాల్గొన్నారు.

29న సీపీఎం పాలేరు డివిజన్ ప్లీనం

మాట్లాడుతున్న పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేశ్

కూసుమంచి, డిసెంబర్ 26: ఈనెల 29న జరిగే పాలేరు డివిజన్ సీపీఎం ప్లీనంను విజయవంతం చేయాలని పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేశ్ అన్నారు. గురువారం స్థానిక పద్మారెడ్డి భవన్‌లో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 29వ తేదీ ఉదయం 10గంటలకు ఖమ్మం నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయం సుందరయ్య భవన్‌లో జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఐద్వా రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ పాల్గొంటారని పేర్కొన్నారు. యడవల్లి రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీ రాజశేఖర్, సన్మతరావు, షేక్ బషీరుద్దీన్, గురుమూర్తి, గంగాధర్, విజయ పాల్గొన్నారు.

దుర్గారావు కుటుంబానికి పరామర్శ

దుర్గారావు భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు మాటేటి కిరణ్

ఖమ్మం, డిసెంబర్ 26: ఖమ్మం నగరంలోని 47వ డివిజన్‌కు చెందిన ఉమ్మినేని దుర్గారావు ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న స్థానిక బీఆర్ఎస్ కార్పొరేటర్ మాటేటి అరుణ నాగేశ్వరరావు గురువారం అతడి నివాసానికి చేరుకొని అతడి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. అనంతరం అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామంటూ ధైర్యం చెప్పారు. నివాళులర్పించిన వారిలో కార్పొరేటర్‌తోపాటు బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు మాటేటి కిరణ్‌కుమార్, బైరోజు యాదగిరి, నజీర్, ఉపేందర్ తదితరులు ఉన్నారు.

కృష్ణమూర్తికి బీఆర్ఎస్ నాయకుల నివాళి

కృష్ణమూర్తి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

మధిర రూరల్, డిసెంబర్ 26: మండలంలోని మహాదేవపురం గ్రామానికి చెందిన చేకూరి నాగేశ్వరరావు మామ గర్నీని కృష్ణమూర్తి దశదిన కర్మ గురువారం జరిగింది. కార్యక్రమానికి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు హాజరై కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. నివాళి అర్పించిన వారిలో ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ రంగిశెట్టి కోటేశ్వరరావు, మధిర టౌన్, మండల అధ్యక్షులు పల్లపోతు వెంకటేశ్వరరావు, రావూరి శ్రీనివాసరావు, నాయకులు మొండితోక జయాకర్, వాసిరెడ్డి నాగేశ్వరరావు, రాఘవరావు ఉన్నారు.

వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నేత్రదానం



నేత్రదానం చేస్తున్న ఉపేందర్‌రావు కుటుంబ సభ్యులు

వైరాటౌన్, డిసెంబర్ 26: మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో ఉంటున్న కేశ ఉపేందర్‌రావు గురువారం ఉదయం మృతి చెందారు. వైరా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు ప్రోత్సాహంతో కుటుంబ సభ్యులు నేత్రాలను దానం చేసేందుకు అంగీకరించారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నేత్రనిధి వారు నేత్రాలను సేకరించారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ పెనుగొండ ఉపేందర్‌రావు, అబ్బూరి రమేశ్, మిట్టపల్లి నాగేశ్వరరావు, మిట్టపల్లి నాగి, రంగా సత్యనారాయణ, తాటికొండ రాము, కాటేపల్లి రామకృష్ణ, ప్రవీణ్‌నాయక్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ! నా క్లయింట్ అయిన షేక్ అల్లా ఉద్దీన్, తండ్రి : లాల్‌సాహెబ్, వయస్సు: 40 సం||లు వృత్తి : రియల్ ఎస్టేట్ వ్యాపారం నివాసం : ఇంటినెం. 3-71/1, యం.వి.పాలెం గ్రామం, ఖమ్మం రూరల్ మండలం, ఖమ్మం జిల్లా. శ్రీ ఆనందం వెంకట రమణ, తండ్రి : విష్ణుమూర్తి, వృత్తి : వ్యాపారం, నివాసం : ఇంటి నెం. 7-88, రంగు బజార్, రాజీవ్ చౌక్, జగ్గయ్యపేట టౌన్ అండ్ మండలం, NTR జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గల వారికి రిజిస్టర్డ్ డాక్యుమెంట్ నెం.3746/2023 ద్వారా సంక్రమించి పూర్తి స్వాధీన హక్కు భుక్తములలో గల ఎటువంటి వివాదములు లేని ఈ క్రింది షెడ్యూల్ ఆస్తిని తన వద్ద నుండి నా క్లయింట్ కొనుగోలు చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు లావాదేవీలు జరిపినారు. ఈ క్రింది షెడ్యూల్ ఆస్తికి సంబంధించి ఎవరికైనా ఏమైనా అభ్యంతరములు ఉన్నచో నాక్లయింట్ కి మూడు రోజులలో లిఖిత పూర్వకముగా అభ్యంతరములు తెలుపవలసినదిగా కోరుతున్నాము.

షెడ్యూలు ఆస్తి వివరములు : ఖమ్మం జిల్లా, కూసుంచి సబ్ రిజిస్ట్రార్ వారి అధికార పరిధిలో రఘునాథపాలెం మండలం, వి.వెంకటాయపాలెం గ్రామ పంచాయితీ పరిధిలోని సర్వే నెం. 253/అ/2 లోని ప్లాట్ నెం.35, విస్తీర్ణము : 220.00 చ||గ|| లు సరియగు 183.94 గల దానికి హద్దులు : **తూర్పు:** ప్లాట్ నెం.70, **పడమర:** 30అడుగుల వెడల్పు గల ప్రతిపాదిత రోడు, **ఉత్తరము :** ప్లాట్ నెం. 34, **దక్షిణము :** ప్లాట్ నెం.36. నా క్లయింట్ ఫోన్ నెం. 9848340292.

గరిక సంపత్ కుమార్, బత్తుల వెంకట్
ఖమ్మం న్యాయవాదులు,ఖమ్మం, సెల్ : 9989274504
తేది :26.12.2024

మహిళపై లైంగికదాడికి యత్నం

వేంసూరు, డిసెంబర్ 26: ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై లైంగికదాడికి యత్నించిన బల్లెపోగు నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరప్రసాద్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జయలక్ష్మీపురం గ్రామంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై అదేగ్రామానికి చెందిన నాగరాజు లైంగికదాడికి యత్నించనట్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

మధిర (చింతకాని), డిసెంబర్ 26: బీరుసీసా పగులగొట్టి దాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు చింతకాని ఎస్సై నాగుల్‌మీరా గురువారం తెలిపారు. చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామంలో బుధవారం రాత్రి మద్యం మత్తులో యువకుల మధ్య ఘర్షణ తలెత్తిన విషయంపై విచారణ చేసినట్లు ఎస్సై తెలిపారు. పాతకక్షలు దృష్టిలో పెట్టుకొని అమర్లపూడి అరుణగాంధీ, తరుణ్‌పై అదే గ్రామానికి చెందిన మూల క్రాంతి, బద్దెల గణేశ్ బీరుసీసాతో అరుణ్ గాంధీ పొట్టలో, తరుణ్ తలపై దాడి చేసి గాయపరిచారు. దాడికి పాల్పడిన క్రాంతి, గణేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

లారీని ఢీకొని వ్యక్తికి గాయాలు

సత్తుపల్లిటౌన్, డిసెంబర్ 26: మండలంలోని బేతుపల్లి- తాళ్లమడ గ్రామాల మధ్య ఉన్న మొగల్ బిర్యానీ పాయింట్ ఎదుట ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ద్విచక్ర వాహనదారుడు ఢీకొనడంతో అతని తలకు తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో 108 సిబ్బంది అక్కడకు చేరుకొని క్షతగాత్రుడిని సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బేతుపల్లి- తాళ్లమడ మధ్య బిర్యాని పాయింట్ పెట్టడం వల్ల వాహనదారులు రోడ్డుపక్కన నిలపడమే కాకుండా రోడ్డు పక్కన బడ్డీకొట్లు రోడ్డును ఆక్రమించడంతో వాహనాలు వెళ్లేందుకు వీలులేకుండా పోతుందని స్థానికులు వాపోతున్నారు. పోలీసులు స్పందించి అక్కడ పరిస్థితిని అదుపు చేయాలని కోరుతున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

వైరాటౌన్, డిసెంబర్ 26: వైరా మున్సిపాలిటీ పరిధిలోని హనుమాన్ బజార్‌లో పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.3,700, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోడిపందెల స్థావరంపై పోలీసుల దాడి

ఎర్రుపాలెం, డిసెంబర్ 26: మండలంలోని బుచ్చిరెడ్డిపాలెం గ్రామ శివారు మామిడితోటలో కోడిపందాలు ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు బుధవారం సాయంత్రం దాడి చేశారు. దాడిలో నలుగురని పట్టుకోగా, ముగ్గురు పరారీలో ఉన్నారు. వారి వద్ద నుంచి రెండు కోడిపుంజులు, రూ.2400 నగదును సీజ్ చేసినట్లు ఎస్సై పీ వెంకటేశ్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వైరా బస్టాండ్‌లో జేబుదొంగల హల్‌చల్

వైరాటౌన్, డిసెంబర్ 26: వైరా ఆర్టీసీ బస్టాండ్‌లో జేబు దొంగలు హల్‌చల్ చేసి ముగ్గురు ప్రయాణీకుల వద్ద బ్యాగులు కట్ చేసి రూ.60 వేలు చోరీ చేశారు. కొణిజర్ల మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన అడపా రంగనాయకులు ఖమ్మం వెళ్లే బస్సు ఎక్కుతుండగా అతని వద్ద ఉన్న రూ.54వేలు, వైరా మండలం గండగలపాడు గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు జగ్గయ్యపేట బస్సు ఎక్కుతుండగా బ్యాగులు కట్ చేసి బంగారం, నగదు చోరీ చేశారు. బస్సులో టికెట్లు తీసుకునేందుకు బ్యాగులు చూసుకోగా ఆధార్ కార్డులతో సహ చోరీ కావడంతో వైరా పోలీసులకు ఫిర్యాదు చేశారు. బస్టాండ్‌లో సీసీ కెమెరాలు ఉన్నా.. అ వి నిరుపయోగంగా మారాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి

వేంసూరు, డిసెంబర్ 26: మండలంలోని మర్లపాడు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు దాసరి వెంకటరామిరెడ్డి (84) గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన నేత్రాలను ఖమ్మం నేత్రనిధికి అందించాలని తెలపడంతో కుమారులు సత్యనారాయణరెడ్డి, అమరారెడ్డి సత్తుపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఖమ్మం నేత్రనిధికి దానం చేశారు. వెంకటరామిరెడ్డి మృతిపట్ల నాయకులు, పూర్వవిద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు.